# ఒక అమ్మకి... ఒక మున్నీ

## నాదెళ్ళ అనూరాధ

అమ్మా! నిన్ను చూసే క్షణాలు ఇంకా కొన్నిగంటలు వెనక్కి వెళ్లాయి. ఎన్నాళ్లైంది నిన్ను చూసి! ఎన్నేళ్లు!?

అవును. ఇది నా ఒక్కదాని సమస్య కదూ, ఈ ప్రపంచానికేం పట్టిందీ?

ఇక్కడి వాతావరణం... ఇక్కడేమిటి! ప్రపంచం అంతా అల్లకల్లోలంగానే వుంది. నేను బయల్దేరబోతున్న ఫ్లైట్‌లో బాంబు పెట్టారన్న హెచ్చరికతో కొన్నిగంటల పాటు ప్రయాణాలన్నీ ఆగిపోయాయి.

ప్రయాణం మొదలయ్యేందుకు ఇంకా కొంత వ్యవధి వుంది. ఈ సమయం నాకెంత విలువైందో ఎవరికి అర్థం అవుతుంది?

నాన్నని, నిన్ను, అత్తమామల్ని, తోబుట్టువుల్ని, స్నేహితుల్ని అందర్నీ చూసి నన్ను నేను జీవంతో నింపుకోవాలన్న కల కార్యరూపం పట్టేందుకు, దాదాపు మూడు సంవత్సరాలు పట్టింది.

సంసారం, పిల్లలు, చదువులు, ఉద్యోగంలో మెట్లు, సంపాదన, అర్థంకాని సంతృప్తి అసంతృప్తి... వీటన్నింటి మధ్యా జీవితం ఉక్కిరిబిక్కిరిగా ఊపిరాడకుండా తయారైంది. వీటిలో దేనినీ వదిలించుకోలేను. నాకంటూ సమయం చేసుకోవడం చేతకావడం లేదమ్మా.

ఆ చిన్న పట్టణంలో, మీ ఇద్దరి పరిమిత ఆదాయంతో మమ్మల్నందర్నీ ఎంత చక్కగా పెంచారమ్మా! ఆశ్చర్యం వేస్తుంది. నువ్వుచెబుతుండేదానివి కదూ,

''ఒట్టి సంపాదన కోసం మాత్రమే కాదు మున్నీ, చదువుకోవాలి. అవకాశం వున్నంత వరకూ చదువుకోవాలి. జీవితాన్ని వివేకంతో తీర్చిదిద్దుకునేం



దుకు చదువు, ప్రపంచజ్ఞానం ఎంతో అవసరం'' అంటూ.

కాలానికి తగ్గట్టు చదువు, దాని వెంట కెరీర్ జీవితంలో సహజంగా యిమిడిపోయాయి. వాటి వెనుకే నా జీవితంలోకి వచ్చిన మధు! నిజం చెబుతున్నానమ్మా, జీవితం పరుగుపందెం కావడం నాకిష్టం లేదు. అయినా ఆ జీవితంలోకే ప్రవేశించాను. అదే ప్రపంచంగా జీవించేస్తున్నాను.

పెళ్లినాడు కాదు కదా, ఈ నాటికీ మధుతో కొన్ని విషయాలు గట్టిగా చెప్పలేను. ఎందుకంటావ్?!

మధుతో ఎన్నో విషయాలు డిస్కస్ చేస్తాను. వాదిస్తాను. కాని అతను నిరంతరం కోరుకునే పరుగుపందెంలాంటి జీవితం నాకు వద్దు అని ఎందుకు చెప్పలేను. లోలోపల నేను కూడా ఈ జీవితాన్నే కోరుకుంటున్నానా? ఈ హిపోక్రసీ ఎక్కడ ఎప్పుడు మొదలైంది నా జీవితంలో?

నిత్యం మధు కనే కలల్ని నా కళ్లతో దర్శించడం ఎన్నేళ్లుగా అలవాటు పడిపోయానమ్మా. అమ్మా! నీ పేరు తల్చుకుంటేనే ఈ మనసెందుకలా కరిగి నీరవుతుంది?

నాకు ఎన్నోసార్లు ఒక విషయం జ్ఞాపకం వస్తుంటుంది. ఏంటో తెలుసా అమ్మా! నిన్నూ, నీ తెలివితేటల్నీ, నీ చదువునీ వాటి తాలూకు ప్రయోజనాల్ని అన్నింటినీ పొందుతూ కూడా నాన్న నీ మీద చేస్తుండే పెత్తనం!

తండ్రిగా అంత ఆదర్శవంతంగా వుండే నాన్న భార్యని మాత్రం తన చెప్పుచేతల్లో వుంచుకోవాలన్న ధోరణి నేను చిన్నప్పట్నించీ గమనిస్తూనే వుండేదాన్ని.

కాలేజీ చదువుకొచ్చాక, నీ వ్యక్తిత్వం ఏర్పడ్డాక నీ ముందు అంటుండేదాన్ని - 'అమ్మా! నీలా మాత్రం నేను జీవించలేను' అని.

ఇంట్లో యిందరికీ ఏ లోటూ రాకుండా చూసుకుంటూ, బయట ఉద్యోగపు ఒత్తిళ్లను అవలీలగా మోస్తున్న నిన్ను నాన్న ఏ ఒక్క విషయంలోనూ, ఏ సందర్భంలోనూ ఒక వ్యక్తిగా తనతో సమాన హోదానిచ్చేవారు కాదు. నీతో సంప్రదించే వారు కాదు. నువ్వు మాత్రం చిర్నవ్వుతో ఆయన ఆజ్ఞల్ని, ఆంక్షల్ని భరిస్తూనే వుండేదానివి.

ఆయనతో సమానమైన చదువు, హోదా, జీవితానుభవం వుండి కూడా నువ్వెందుకిలా సబ్‌మిసివ్‌గా వుండాలని నాకు నాన్నమీద కోపం వస్తుండేది. అన్ని విషయాల్లోనూ మాట నెగ్గించుకునే నాన్నంటే ఒక్కోసారి వ్యతిరేక భావం కల్గుతుండేది.

కాని మాకోసం నిరంతరం తపన పడి, మా ప్రతిచిన్న అవసరాన్నీ అడక్కుండా తీర్చాలని ఆశ పడే నాన్న! ప్రియమైన నాన్న! అంత ప్రేమగానూ నిన్నూ చూసుకున్నట్లుండేవారు. అంతలోనే అంతా, అన్నీ కేవలం తన ఇష్టాయిష్టాలతోనే.

ఇంట్లో యిందరికీ ఏ లోటూ రాకుండా చూసుకుంటూ, బయట ఉద్యోగపు ఒత్తిళ్లను అవలీలగా మోస్తున్న నిన్ను నాన్న ఏ ఒక్క విషయంలోనూ, ఏ సందర్భంలోనూ ఒక వ్యక్తిగా తనతో సమాన హోదానిచ్చేవారు కాదు. నీతో సంప్రదించే వారు కాదు. నువ్వు మాత్రం చిర్నవ్వుతో ఆయన ఆజ్ఞల్ని, ఆంక్షల్ని భరిస్తూనే వుండేదానివి.



ఇదంతా ఎందుకు చెబుతున్నానో తెల్సా అమ్మా? మధుక్కావలసిన జీవితాన్ని నాదిగా చేసుకుని ఎందుకు జీవించేస్తున్నానని నా మీద నాకు కోపం. పిల్లల విషయంలో, ఆఫీసు పని విషయాల్లో ఎంతో ఎసర్టివ్‌గా వుండే నేనెందుకిలా వుంటానో అర్థం కాదు.

మధు నాన్నలాగా పెత్తనం చేస్తున్నట్లు కన్పించడు. మృదువుగా తన అభీష్టాలను వ్యక్తం చేస్తాడు. చెల్లించుకుంటాడు. ఇదో రకం.

నేనూ పెద్దదాన్నవుతున్నాను. ఎదుగుతున్న నా పిల్లల భావాలు అరిగించుకోలేక, సమర్థించనూ లేక, ఈ సొసైటీ నుండి దూరంగా, అతి దూరంగా నా చిన్నారుల్ని తీసుకుని ఎక్కడికైనా పారిపోవాలని వుందమ్మా. కాని ఎవరికోసమైతే ఈ దిగుళ్లు పెంచుకుంటున్నానో వాళ్లూ నాదంతా చాదస్తంగా, అర్థంలేనివిగా కొట్టిపారేస్తుంటే ... ఏం చెయ్యనమ్మా?

అమ్మా? అప్పట్లో నేనడిగే ప్రశ్నలకి నువ్వు చిర్నవ్వుతో ఇచ్చే సమాధానాలు నా చెవుల్లో ఇంకా గింగురుమంటూనే వున్నాయి.

"మున్నీ! జీవితం విలువైనది. అర్థం లేని పంతాలతో, అహంకారాలతో ఏమీ పొందలేము. అతను ప్రేమించే మనిషైతే చాలు అతని పొసెసివ్‌నెస్ అర్థం చేసుకోగల్గాలి. ప్రేమతోనే అతన్ని జయించగలం. ప్రేమించడం తెలియని వాడైతే మాత్రం నువ్వు చెప్పినట్లు ఆ జీవితానికి అర్థం లేదు.

నువ్వింకా చిన్నపిల్లవి. జీవితాన్ని పాజిటివ్ దృక్పథంతో చూడటం నేర్చుకో. అది తెలియకే ప్రపంచంలో ఇన్ని సమస్యలు, ఇంత దుఃఖం"

ఎంత చక్కగా చెప్పేవమ్మా! తెల్లవారిలేస్తే నీ మాటలు నా మనసులో మెదులుతూనే వుంటాయి. ఒక్కసారి వచ్చి నీ ఒడిలో పడుకుని, నీ మెడచుట్టూ చేతులు పెనవేసి తనివితీరా నిన్ను చూడాలనుకుంటాను. నన్ను విన్పించాలనుకుంటాను. ఇదే తీర్చుకోలేని కోరికై నిన్ను ఊరిస్తుంటూంది. ఇన్ని వేల మైళ్ల దూరంలో ఎందుకు బ్రతకాలో నాకర్థం కాదు.

మధుతో ఎన్నోసార్లు చెబుతాను.

"మనం మనదేశం వెళ్లిపోదాం మధూ" అని. చక్కగానవ్వుతాడు. "మనకంటే మంచి అవకాశాలు మన పిల్లలకివ్వాలనే కదూ ఇంతదూరం వచ్చింది. మరి వాళ్ల చదువులు పూర్తిచేసి జీవితాల్లో స్థిరపడనీ, వెళ్లిపోదాం" అంటాడు.

ఇంకా ఎంతకాలం నిరీక్షిస్తే ఆ క్షణాలొస్తాయి?

"మీ అమ్మానాన్నలు మాత్రం పుట్టి పెరిగిన పల్లెలు వదిలి ఉద్యోగరీత్యా పట్టణాలకొచ్చి స్థిరపడలేదా? వాళ్లు వాళ్ల పల్లెలు వదలకూడదనుకుంటే నిన్నింతవరకూ చదివించగల్గేవారు? వాళ్లకంటే మెరుగైన జీవితాలు మాకివ్వాలనే కదూ వాళ్లు ప్రయత్నించింది" అంటూ ప్రశ్నిస్తాడు.

"పిల్లలు యిక్కడ స్థిరపడ్డాక వాళ్లని వదిలి వెనక్కి వెళ్లగలమా?" అంటే "వాళ్ల జీవితాలు వాళ్లవి. మన బాధ్యతలు ముగించుకు మనం వెళ్లిపోదాం" అంటాడు మధు.

ఇదేమిటమ్మా? వాళ్లకి దూరంగా అయినా నేను వుండగలనా? మధు చెప్పేదంతా సాధ్యమేనా అని నాకు ఎన్నెన్నో ప్రశ్నలు. నా ప్రశ్నలన్నీ నువ్వే వినగలవు. నన్ను సమాధానపరచనూ గలవు. అన్ని ప్రశ్నలకి నీదగ్గర సమాధానం దొరుకుతుందమ్మా.



ఇన్నేళ్లూ మీ అందర్నీ విడిచి ఇంతదూరం వచ్చేనన్న బెంగ, ఇకపై పిల్లల్ని వదులుకోవాలన్న దిగులు కాబోలు. జీవితమంటే బెంగలేనా అమ్మా? నవ్వుతున్నావు కదూ నా ఆలోచనలు చూసి.

సంక్రాంతికి నీ దగ్గరికి రావాలని ఎంతగా ప్రయత్నించేనో! చిన్నప్పుడు హాఫ్ ఇయర్లీ పరీక్షలెప్పుడవుతాయా, సంక్రాంతి శెలవులెప్పుడొస్తాయా అని ఎదురు చూసేవాళ్లం! విశాలక్క శారదక్క నన్ను చిన్నపిల్లవంటూ గొబ్బిళ్లు పెట్టేందుకు, ముగ్గులు వేసేందుకు రానిచ్చేవారు కాదు. పెరట్లో డిసెంబరం పూలు, చామంతులు, బంతి పువ్వులు కోసుకురమ్మని పురమాయించేవారు.

ఆ పనిమాత్రం నేను చెయ్యనంటూ అలిగి యేడ్చేదాన్ని. ఆ చీకటి వదలని చలిలో అరుగు మీద కూర్చోబెట్టుకుని నన్ను సముదాయించే నువ్వెన్నిసార్లు జ్ఞాపకానికొస్తావో నమ్మా.

పనులన్నీ పక్కనబెట్టి మా సరదాలన్నీ ముచ్చటగా తీర్చే నీ ఓర్పు, రూపు కళ్లకు కట్టినట్లున్నాయమ్మా.

అందుకే సంక్రాంతి నాటికి అక్కడికొస్తే మనందరం ఆ జ్ఞాపకాలను మళ్లీ మరోసారి సజీవంగా అనుభవంలోకి తెచ్చుకోవచ్చని ఆశపడ్డాను.

ఎప్పుడైనా అపురూపంగా ఖాళీదొరికితే పిల్లల్ని కూర్చోబెట్టుకుని ఈ కబుర్లన్నీ చెబుదామనుకున్నా ఆ అనుభవం వాళ్ల వూహక్కూడా అందదు. వాళ్ల ముఖాల్లో అయోమయం నాలో ఉత్సాహాన్నంతా నీరు కారుస్తుంది.

అప్పటికీ నాలోకంలో నేను చెప్పుకుపోతుంటే వాళ్లు నన్ను సంభ్రమంగా, జాలిగా వింటుంటారు. మధురాగానే రిలీఫ్‌గా అతని దగ్గరకు పరుగెత్తుకు వెళ్లిపోతారు.

చిన్నప్పుడు నాన్న చుట్టూ చేరి మేమంతా "మాకు నాన్నంటే ఇష్టం" అంటుండేవాళ్లం. నీ ప్రశాంతమైన ముఖంలో ఎప్పుడూ అదే చిర్నవ్వు.

నాన్న అంటే అరుదుగా దగ్గరకు తీసుకుని గారం చెయ్యటమే కాని అమ్మా అంటే నిరంతరం నిలువెల్లా ఆత్మీయతే అని మెల్లిమెల్లిగా అర్థమైంది.

ఇన్నాళ్ల ఎదురుచూపులు పూర్తై బయల్దేరబోయే ముందు ఆ అవాంతరం .. కన్పించని ఎవరిమీదో కోపం వస్తోందమ్మా.

ఎందుకమ్మా, ప్రపంచం ఇంత చెడుగా తయారవుతోంది? ఇన్‌సెక్యూరిటీ! బతికే క్షణం ఏదీ నీది కాదు. బయట ప్రపంచపు ఎన్నెన్ని ఇన్‌ఫ్లూయెన్స్‌లు మన జీవితాల మీద!

నాది, నాకోసం లాంటి తాపత్రయం మనిషికి ఎక్కువైపోతోంది కదూ రాన్రానూ. అదీ హద్దులు ఎరుగనంతగా.

మధుతో ఈ ప్రయాణం ఇలా మరికొన్ని గంటలు వాయిదా పడిందని చెబితే.

"హాయిగా ఇంటికొచ్చేయ్‌రా, అందరం కల్సి వీలు చూసుకు వెళ్దాం" అంటున్నాడు.

చూడమ్మా. నేనింతగా ఆరాటపడుతున్నా అర్థం చేసుకోడు. పైగా "నాకు మాత్రం మా అమ్మానాన్నల మీద బెంగలేదా?" అంటున్నాడు.

ఇక్కడ ఎయిర్‌పోర్ట్‌లో ఓ మూల కూర్చుని నీకిదంతా రాస్తున్నాను. నా రాకకంటే ముందే ఈమెయిల్ నిన్ను చేరుతుంది.

ఇంటిదగ్గర పిల్లల్ని వదిలి వస్తున్నానన్న దిగులు లేకపోలేదు. కాని మిమ్మల్ని చూడాలన్న ఆశ గుండె పట్టనంతగా పెరిగి, పెరిగి నన్ను నిలువ నీయడం లేదమ్మా.

ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరుతూ దివ్యని దగ్గరకు తీసుకుని "బెంగపెట్టుకోకు నాన్నా" అంటున్న నన్నూ, నా కళ్లలో నీటిని చూసి తెల్లబోయింది. పైగా బెంగెందుకని నవ్వుతూంది చూడు.

ఇల్లు దాటిన మరుక్షణం మాత్రం నా ఆలోచనలనిండా కేవలం మీరు మాత్రమేనమ్మా.

అదిగో ఇక టైమ్ కావొస్తోంది. వుంటానమ్మా.

నీ
మున్ని